క్లుప్తంగా

కాంప్లెక్స్ ఎరువులు కొనుగోలు చేస్తేనే యూరియా

శంకరపట్నం: కాంప్లెక్స్ ఎరువులు కొంటేనే రైతులకు యూరియా బస్తాలు అందించిన సంఘటన గురువారం మండలంలోని లింగాపూర్‌లో వెలుగు చూసింది. గ్రామంలోని గోదాంకు యూరియా లారీ రావడంతో రైతులు గోదాం వద్దకు చేరుకున్నారు. ఒక్క బస్తా తీసుకున్న రైతులకు ఎలాంటి మెలికలు పెట్టకుండా అందించారు. మూడు బస్తాలు తీసుకునే రైతులకు కాంప్లెక్స్ ఎరువు లేదా గుళికలు, పురుగుమందు తీసుకోవాలని గోదాం ఇంచార్జి చెప్పడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేశారు.ఈ విషయమై మెట్‌పల్లి సహకార సంఘం సీఈవో సదయ్యను వివరణ కోరగా ఒక్క బస్తా లింకులు లేకుండా ఇస్తున్నామని, మూడు బస్తాలు తీసుకుంటే కాంప్లెక్స్ ఎరువులు రైతులకు అందించాలని పాలకవర్గం తీర్మానం చేసిందన్నారు. ఇతర ఫెస్టిసైడ్స్ ప్రైవేట్ దుకాణాల్లో రైతులు కొంటున్నారని, యూరియా కోసం సొసైటీ గోదాంకు వస్తున్నారని పేర్కొన్నారు.

హద్దురాళ్ల ఏర్పాటులో అధికారుల నిర్లక్ష్యం



మాట్లాడుతున్న మోరె గణేశ్

శంకరపట్నం: మండలంలోని మొలంగూర్ గ్రామంలో ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమిలో హద్దు రాళ్లు ఏర్పాటు చేయకుండా రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, 18న తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని తెలంగాణ జనసమితి జిల్లా అధ్యక్షుడు మోరె గణేశ అన్నారు. మండలంలోని మొలంగూర్ గ్రామంలో గురువారం మాట్లాడారు. సర్వేనంబర్ 703లో ప్రభుత్వ భూమిని ఆక్రమించుకొని రేకుల షెడ్లు వేసుకున్నారని ఆరోపించారు. ఆక్రమిత ప్రభుత్వ భూమిని అధికారులు స్వాధీనం చేసుకొని నిరుపేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేయాలన్నారు. తహసీల్దార్ కార్యాలయం ముట్టడికి రాజకీయ పార్టీలు మద్దతు ఇవ్వాలని కోరారు. సమావేశంలో శివప్రసాద్, శ్యాం,శ్రీకాంత్, వంశీ, శివస్వామి, శివసాయిలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం పరిశీలన



సెంటర్‌ను పరిశీలిసున్న చైల్డ్ టీం సభ్యులు, సీడీపీవో, తదితరులు

జమ్మికుంటరూరల్: మండలంలోని జగ్గయ్యపల్లి గ్రామం అంగన్‌వాడీ కేంద్రాన్ని గ్లోబల్ సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ ది చైల్డ్ టీం సభ్యులు గురువారం పరిశీలించారు. కేంద్రంలో బాలింతలు, తల్లులు, పిల్లల కోసం అందిస్తున్న సేవలు, కార్యక్రమాలు తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో చైల్డ్ టీం మెంబర్స్, సీడీపీవో సుగుణ, సూపర్‌వైజర్ శిరీష, నితిన్, అంగన్‌వాడీ టీచర్ సంధ్యరాణి, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు పూర్తిచేయాలని ఆందోళన



ఆందోళన చేస్తున్న రైతులు

శంకరపట్నం: బైపాస్ రోడ్డు పనులు పూర్తి చేయకపోవడంతో పొలాల్లో వర్షం నీరు నిలిచిందని ఆరోపిస్తూ గురువారం అంబాల్‌పూర్ రైతులు రోడ్డుపై ఆందోళన చేశారు. గ్రామానికి చెందిన పలువురి రైతుల పొలాలు వానాకాలంలో నీట మునుగుతున్నాయన్నారు. పనులు పూర్తి చేయకపోవడంతో వర్షం నీరు పొలాల్లోకి చేరుతుందని పనులు నిర్వహిస్తున్న కంపెనీ టిప్పర్లను అడ్డుకున్నారు. సంబంధిత అధికారులు స్పందించి పనులు పూర్తి చేయించాలని డిమాండ్ చేశారు.

దరఖాస్తుల ఆహ్వానం



ఇల్లందకుంట: మండలంలోని టేకుర్తి మోడల్ స్కూల్‌లో గంటల ప్రాతిపదికన తెలుగు, ఇంగ్లిష్ సబ్జెక్టులు బోధించడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డి.ఐలయ్య గురువారం ప్రకటనలో తెలిపారు. ఆసక్తి, అర్హత ఉన్నవారు 12వ తేదీలోపు పాఠశాలలో బయోడేటా అందజేయాలని, డెమో, ఇంటర్వ్యూకు ఒరిజినల్ ధ్రువపత్రాలతో హాజరుకావాలని, అభ్యర్థులు టెట్ ఉత్తీర్ణులై ఉండాలని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

ఘనంగా గురుపౌర్ణమి



చొప్పదండి: పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సత్యం



జమ్మికుంట: దర్శనం చేసుకుంటున్న భక్తులు



కేశవపట్నం బ్రహ్మవిద్యాశ్రమంలో హోమం



దత్తాత్రేయశర్మను సన్మానిస్తున్న నాయకులు



మొక్కలు నాటుతున్న విద్యార్థులు

మానకొండూర్: మండలంలోని గంగిపల్లి గ్రామం సాయిబాబా మందిరంలో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ గురుపౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు, అర్చకులు పూర్ణకుంభంతో ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు.

చొప్పదండి: పట్టణంలోని సాయిబాబా ఆలయం, జ్ఞాన సరస్వతి ఆలయంలో గురుపౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

హుజూరాబాద్: బీజేపీ పట్టణ అధ్యక్షుడు రాజు ఆధ్వర్యంలో నాయకులు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని ప్రిన్సిపాల్,ప్రభుత్వ హైస్కూల్లో హెడ్‌మాస్టర్, ఉపాధ్యాయులను సన్మానించారు. అలాగే వేద పండితులు దత్తత్రేయ శర్మను సన్మానించి ఆశీస్సులు అందుకున్నారు.

జమ్మికుంట: పట్టణంలోని హౌజింగ్‌బోర్డు కాలనీ శ్రీలక్ష్మిగణపతి సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మహా అన్నదానం, సాయంత్రం స్వామివారికి పల్లకి సేవా ఊరేగించారు. భక్తులు భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించుకున్నారు. కొత్తపల్లిలోని శ్రీభక్తాంజనేస్వామి ఆలంలో గురుపౌర్ణమి వేడుకలు నిర్వహించారు. కర్ణాటకలోని ప్రముఖ పుణ్యక్షేత్రం గానుగాపూర్ నుండి తీసుకవచ్చిన శ్రీదత్తాత్రేయస్వామి పాదుకలకు అర్చకులు వరప్రసాద్ పూజలు చేశారు.

శంకరపట్నం: కేశవపట్నం బ్రహ్మవిద్యాశ్రమంలో గురుపౌర్ణమి సందర్భంగా పీఠాధిపతులు హోమం, గీతాపారాయణం, ప్రవచనాలు చేశారు. రిటైర్డ్ ఎంఈవోలు రామస్వామి, ప్రభాకర్, హెచ్‌ఎం సుభాష్, పీఠాదిపుతులను నిర్వాహకులు సత్కరించారు. వెంకటేశ్వర్లపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులు నర్సరీ పరిశీలించి పాఠశాల ఆవరణలో హెచ్‌ఎం కోటేశ్వర్‌రావుతో కలిసి మొక్కలు నాటారు.

ఇల్లందకుంట రోడ్డు



ఇల్లందకుంట: మండలంలోని టేకుర్తి గ్రామం నుంచి రేణుకా ఎల్లమ్మ ఆలయం, మండల కేంద్రానికి వెళ్లే మట్టి రోడ్డు చిన్నపాటి వర్షానికే మరీ అధ్వానంగా తయారైంది. దారిగుండా వెళ్లే గౌదన్నలు, రైతులు, వాహనదారులు రాకపోకలు సాగించదానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఇల్లందకుంటకు ఈ రోడ్డు ద్వారానే టేకుర్తి, గడ్డివానిపల్లితో పాటు వివిధ గ్రామాల ప్రజలు రాకపోకలు సాగించేవారు. సంబంధిత అధికారులు, నాయకులకు సమస్య పరిష్కరించాలని ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదని ఇప్పటికైనా స్పందించి బీటీ రోడ్డు వేయాలని కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
శివకుమార్, పంచాయతీరాజ్ ఏఈ, సెల్ నంబర్: 6301538145

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది.

మా ఫోన్ నంబర్లు: 9393557752, 9848408781, 8790144227

నువ్వు ఒక్క పోస్టర్ వేస్తే నేను 100 వేస్తా

- రసమయి నీ చరిత్ర బయటపెడతా
- కమీషన్లు తీసుకున్నట్లు నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంట
- మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి

మానకొండూర్: 'పనులు చేసేందుకు ప్రభుత్వమే డబ్బులు లేక ఇవ్వడం లేదు. అలాంటప్పుడు కమీషన్లు ఎలా వస్తాయి. కమీషన్ల పేరిట నువ్వు ఒక్క పోస్టర్ వేస్తే నేను 100పోస్టర్లు వేస్తా. నీ చరిత్ర మొత్తం బయటపెడతా' అని కరీంనగర్ జిల్లా మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌పై ఘాటు విమర్శలు చేశారు. మానకొండూర్ మండలంలోని గంగిపల్లి గ్రామంలో గురువారం మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని గుండ్లపల్లి– గన్నేరువరం రహదారి బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో మంజూరైందంటే సంతోషపడ్డానని, మంజూరు ఆర్డర్ ఉత్తదే అని తేలిపోయిందన్నారు. తాను సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి రహదారి మంజూరు చేయించానని తెలిపారు. పాత కాంట్రాక్టర్ కమాలోద్దీన్ పనులు చేస్తే రూ.100కోట్లు పెండింగ్‌లో పెట్టారని ఆరోపించారు. పదేళ్ల అధికారంలో ఉండి గన్నేరువరం–గుండ్లపల్లి రహదారి ఎందుకు చేపట్టలేదో చెప్పాలన్నారు. ఎంపీపీ, జెడ్పీటీసీ, మార్కెట్ కమిటీ చైర్మన్ దగ్గర డబ్బులు తీసుకున్న చరిత్ర రసమయిదని మండిపడ్డారు. తాను కమీషన్లు తీసుకున్నట్లు నిరూపిస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానన్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నందగిరి రవీంద్రచారి, మార్కెట్ కమిటీ చైర్మన్ మర్రి ఓదెలు, ఉపాధ్యక్షుడు రామిడి తిరుమల్‌రెడ్డి పాల్గొన్నారు.

'జ్యోతిష్మతి'లో ప్రత్యేక పూజలు



ప్రత్యేక పూజల్లో చైర్మన్ సాగర్ రావు, విజయలక్ష్మి

తిమ్మాపూర్: మండలంలోని జ్యోతిష్మతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ (అటానమస్) కళాశాల ఆవరణలోని శ్రీసాయిబాబా ఆలయంలో గురుపౌర్ణమిని ఘనంగా నిర్వహించారు. ఆలయ పూజారులు అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణాన్ని మామిడి, అరటి ఆకులు, వివిధ రకాల పూలతో అలంకరించారు. ఆలయ ప్రాంగణాన్ని రంగులమయం చేశారు. మధ్యాహ్న హారతిలో జ్యోతిష్మతి విద్యాసంస్థల చైర్మన్ జువ్వాడి సాగర్ రావు, చైర్‌పర్సన్ విజయలక్ష్మి, సెక్రటరీ సుమిత్ సాయి పాల్గొన్నారు. వేడుకలను తిలకించేందుకు విద్యార్థులు, సమీప గ్రామాల భక్తులు తరలివచ్చారు. అదే ప్రాంగణంలో కొలువుదీరిన సరస్వతీ దేవికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం, ప్రసాదం వితరణ చేశారు.

కరీంపేటలో స్పెషల్‌డ్రైవ్



నిలిచిన వర్షపు నీటిని పరిశీలిస్తున్న అధికారులు

శంకరపట్నం: మండలంలోని కరీంపేట గ్రామంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అధికారులు గురువారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. రెండేళ్ల క్రితం గ్రామ ప్రజలు డెంగీబారిన పడి ఆస్పత్రి పాలయ్యారు. గత అనుభవాల దృష్ట్యా ఎంపీడీవో కృష్ణప్రసాద్, ఎంపీవో ప్రభాకర్, వైద్యాధికారి శ్రావణ్, పంచాయతీ కార్యదర్శులు, పంచాయతీ సిబ్బంది, వైద్యసిబ్బంది ఇంటింటా తిరుగుతూ శుభ్రత, నీటి నిల్వలను పరిశీలించారు. నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. మండలంలోని కేశవపట్నం ఎస్సీ హాస్టల్, కస్తూర్బాగాంధీ, మోడల్‌స్కూల్ ఆవరణలో దోమల నివారణ మందు స్ప్రే చేశారు.

రేపు విద్యుత్ సరఫరా బంద్



వీణవంక: మండలంలోని పోతిరెడ్డిపల్లి, ఎల్బాక, కోర్కల్, వీణవంకలోని 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాలలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏడీ రాజేందర్ తెలిపారు. ఎల్బాక పరిధిలో ఉదయం పది గంటల నుంచి 12 గంటల వరకు, కోర్కల్ మధ్యాహ్నం 3.30 గంటల నుంచి 5.30గంటల వరకు, వీణవంక, పోతిరెడ్డిపల్లిలో ఉదయం 9 గంటల నుంచి 10.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఆరోగ్య కేంద్రానికి చేయూత



బుక్స్ అందిస్తున్న పొన్నం అనిల్ గౌడ్

తిమ్మాపూర్: మండలంలోని మన్నెంపల్లి ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రానికి మాజీ ఉపసర్పంచ్ అనిల్ గౌడ్ రూ.ఐదువేలు విలువ చేసే రిజిస్టర్ బుక్స్ గురువారం అందించారు. రోగులకు మెరుగైన వైద్యం అందించాలని, ఆరోగ్య కేంద్రంలో ఎలాంటి సమస్యలు ఉండకూడదని చేయూత ఇచ్చినట్లు వెల్లడించారు. ఏదైనా అవసరం ఉంటే సంప్రదించాలని సూచించారు. ప్రజల కోసం ఎలాంటి సాయమైనా చేయడానికి సిద్ధంగా ఉంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గుర్రాల వెంకటయ్య, గుర్రం జగదీశ్, పోతుగంటి సంపత్, సుధగొని శ్రావణ్, కొలిపాక కిరణ్, అలువాల కనకరాజేశం, సారయ్య, కొలిపాక మణిశంకర్ పాల్గొన్నారు.

డాక్టరేట్ ప్రదానం

హుజూరాబాద్: ట్రస్మా జిల్లా అధ్యక్షుడు పట్టణానికి చెందిన కోరెం సంజీవరెడ్డి డాక్టరేట్ అందుకున్నారు. 35 సంవత్సరాలుగా విద్యారంగంలో విశేష సేవలు అందించినందుకు యూకేకు చెందిన హోప్ థియాటికల్ యూనివర్సిటీ అధికారులు బుధవారం రాత్రి హైదరాబాద్‌లో డాక్టరేట్ ప్రదానం చేశారు. టెట్రా స్కూల్ అధిపతిగా ట్రస్మా జిల్లా అధ్యక్షుడిగా విద్యారంగానికి విశేష సేవలు అందించారని, డాక్టరేట్ అందుకోవడం పట్ల పలువురు విద్యావేత్తలు హర్షం వ్యక్తం చేశారు.

కళాకారుల ప్రదర్శన

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నం గ్రామంలో ఇందిరా మహిళాశక్తి పథకంపై సాంస్కృతిక కళాకారులు ప్రదర్శన ఇచ్చారు. వ్యాపారాల్లో మహిళలను భాగస్వామ్యం చేసేలా ప్రభుత్వం తీసుకువస్తున్న పథకాలను కళాకారులు పాటల రూపంలో వివరించారు. అనంతరం గ్రామంలో మహిళాశక్తి పథకంపై సమావేశం జరిగింది.

వాగేశ్వరిలో ఓరియంటేషన్ ప్రోగ్రాం



నృత్యాలు చేస్తున్న విద్యార్థులు

కరీంనగర్: కరీంనగర్‌లోని వాగేశ్వరి డిగ్రీ, పీజీ ఉమెన్స్ కళాశాలలో నూతన విద్యార్థుల కోసం గురువారం ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. కళాశాల చైర్మన్ బీవీఆర్ గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ వాగేశ్వరి కళాశాల రాష్ట్రస్థాయిలో విశిష్ట గుర్తింపు పొందిన విద్యాసంస్థగా నిలవడం గర్వకారణం అన్నారు. ప్రిన్సిపల్ టి. లింగమూర్తి, డిగ్రీ ఉమెన్స్ కళాశాల ప్రిన్సిపల్స్ సతీశ్ గౌడ్, వెంకటరెడ్డి, వైస్ ప్రిన్సిపల్స్ చెన్నమల్ల చైతన్య, రమణాచారి, ప్రసాద్, ఏవోలు నిజాముద్దీన్, వేదవ్యాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. హైదరాబాద్ నుంచి జబర్దస్త్ టీం సభ్యులు వినోదిని, గడ్డం నవీన్, అప్పారాలు హాజరై విద్యార్థులకు ప్రేరణాత్మక సందేశాలు ఇచ్చారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

అబాకస్ పోటీల్లో పతకాలు



విద్యార్థులను అభినందిస్తున్న నరేందర్ రెడ్డి

కొత్తపల్లి: ఎస్‌ఐపీ అబాకస్ అకాడమీ ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఈటెక్నో స్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ప్రథమ బహుమతితో పాటు నగదు ప్రోత్సాహం అందుకున్నట్లు ఆ విద్యా సంస్థల చైర్మన్ వి.నరేందర్ రెడ్డి తెలిపారు. ఇ.అన్విత మొదటి స్థానంతో పాటు నగదు బహుమతి, సర్టిఫికెట్, మెడల్, జి.హర్షిత్ రజత పతకం, సర్టిఫికెట్, ఎండీ ఇస్లాం మొదటి రన్నరప్‌తో పాటు మెడల్, సర్టిఫికెట్ పొందినట్లు తెలిపారు. పతకాలు సాధించిన విద్యార్థులను గురువారం పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సభలో అభినందించారు. వీఎన్‌ఆర్ మాట్లాడుతూ... విద్యార్థులు మేధస్సు పెంపొందించడానికి అబాకస్ దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ జీనియస్ బుక్ ఆఫ్ రికార్డులో మన్వేంద్రకు చోటు



కనపర్తి మన్వేంద్ర

కరీంనగర్ కల్చరల్: నగరంలోని చేంజ్ మెమోరీ అకాడమీలో శిక్షణ పొందిన 13 ఏళ్ల బాలుడు కనపర్తి మన్వేంద్ర రసాయన శాస్త్రంలో పీరియాడిక్ టేబుల్ మూలకాలలో ఎలిమెంట్ అటామిక్ నంబర్స్, మాస్ నంబర్స్‌ను కంఠస్థం చేసి అంతర్జాతీయ జీనియస్ బుక్ ఆఫ్ రికార్డులో చోటు సంపాదించారు. మన్వేంద్రకు రికార్డ్ సాధించిన సర్టిఫికెట్ మెయిల్ ద్వారా పంపినట్లు చేంజ్ మెమోరీ అకాడమీ నిర్వాకులు వేణు తెలిపారు. శుక్రవారం ఫిలింభవన్‌లో మనేంద్రను సన్మానించి సర్టిఫికెట్లు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు.

ఆరోగ్యానికి ఔషధం వ్యాయామం

కరీంనగర్‌స్పోర్ట్స్: ఆరోగ్యానికి ఔషధం వ్యాయామం అని మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ అన్నా రు. గురువారం భగత్‌నగర్‌లో ఏర్పాటు చేసిన స్టార్ ఫిట్‌నెస్ జిమ్‌ను ప్రారంభించారు. అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్, నాయకులు గుడికందుల సత్యం, వర్థ వెంకటరెడ్డి, జి. సంధ్య తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

● **చెత్త సేకరణ ఆటోలు ప్రారంభం**

చొప్పదండి: పట్టణంలో తడి, పొడిచెత్త సేకరణకు రూ.40 లక్షలతో కొనుగోలు చేసిన ఐదు చెత్త సేకరణ వాహనాలను ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం గురువారం ప్రారంభించారు. అనంతరం రూ.15 లక్షలతో జవహర్ నవోదయ విద్యాలయంలో సీసీరోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఆర్నకొండ గ్రామంలో మడేలయ్య గుడి వద్ద బోర్‌వెల్‌ను ప్రారంభించి మేకల మండి వద్ద హైమాస్ట్ ప్రారంభించారు. అనంతరం బస్టాండ్ చౌరస్తాలో కాంగ్రెస్ జెండా ఎగురవేశారు

● **పెండింగ్ బిల్లులు చెల్లించాలి**

ఇల్లందకుంట: గ్రామ పంచాయతీ కార్మికులకు పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి కొప్పుల శంకర్ డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని పలు గ్రామాలలో పర్యటించారు. ప్రభుత్వం విడుదల చేసిన నిధులను మండల అధికారులు పంచాయతీ కార్మికులకు చెల్లించాలని లేదంటే ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తామన్నారు. ఇల్లందకుంట, సిరిసేడు, టేకుర్తి, గడ్డివానిపల్లి గ్రామ కమిటీలు ఎన్నుకున్నామని తెలిపారు.

● **టీచర్ల సమస్యలు పరిష్కరించాలి**

రామడుగు: మోడల్ స్కూల్ టీచర్ల సమస్యలు పరిష్కరించాని డీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.రాజిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సభ్యత్వ నమోదులో భాగంగా గురువారం మండలంలోని వివిధ పాఠశాలలను సందర్శించారు. మోడల్ స్కూల్ టీచర్లు పనిభారంతో, అభద్రతా భావంతో పనిచేస్తున్నారని టీచర్ల సంక్షేమ బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. విద్యార్థులు అధికంగా ఉన్న చోట అదనపు ఉపాధ్యాయులను నియమించాలని, మరణించిన ఉపాధ్యాయుల డిపెండెంట్లకు ఉద్యోగాలు ఇవ్వాలన్నారు.

● **శ్రీరాములపల్లిలో స్వచ్ఛత సర్వే**

రామడుగు: స్వచ్ఛ సర్వేక్షణ్–2025లో భాగంగా పారిశుధ్యం మెరుగుపరిచేందుకు కేంద్ర ప్రభుత్వ సర్వే బృందం సభ్యురాలు రజిత మండలంలోని శ్రీరాములపల్లి గ్రామాన్ని సందర్శించారు. చెత్తసేకరణ, తరలింపు, ప్రభుత్వ సంస్థల పనితీరు తదితర అంశాలపై ప్రజలతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్యక్రమాల అమలు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకున్నారు.

● **నగదు అందజేత**

మానకొండూర్: మండలంలోని ఈదులగట్టెపల్లి గ్రామం శ్రీవేంకటేశ్వర పురుషుల పొదుపు సంఘం సభ్యుడు గోపాల శ్రీకాంత్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యులకు రూ.రెండు లక్షల ప్రమాద బీమా సంఘం సభ్యులు గురువారం అందజేశారు.

● **విగ్రహ ప్రతిష్ఠాపన**

జమ్మికుంట: జమ్మికుంట మున్సిపల్ శివారులో కారు, ఆటో, ట్రాలీ యూనియన్ ఆధ్వర్యంలో మైసమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం పురస్కరించుకొని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. జమ్మికుంట నుంచి హుజూరాబాద్, హైదరాబాద్, హనుమకొండ, కరీంనగర్‌కు ప్రతిరోజుల వేల సంఖ్యలో వాహనాల రాకపోకలు సాగుతాయని, ప్రయాణంలో ఎలాంటి ఆటంకాలు రాకుండా చూడాలని మైసమ్మ తల్లిని వేడుకున్నారు. విగ్రహదాత మహాలక్ష్మి ఐరన్ షాపు యాజమాని రవీందర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

● **ఘనంగా శ్రీధర్మవ్యాధుడి ఉత్సవాలు**

హుజూరాబాద్: కటిక కులస్తుల ఆరాధ్య దైవం శ్రీధర్మవ్యాధుడు ఉత్సవాలను హుజూరాబాద్ కటిక సేవా సంఘం ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని మార్కెట్ ఏరియాలో ఘనంగా నిర్వహించారు. సంఘం నాయకులు శ్రీధర్మవ్యాధుడి చిత్రపటానికి పూలమాలవేసి స్మరించుకున్నారు.

● **నిరాహార దీక్ష**

వీణవంక: మండలంలోని హిమ్మత్‌నగర్–కొండపాక గ్రామాల మధ్య ఇసుక పంచాయతీ నిరాహారదీక్ష వరకు చేరింది. ఇసుక లారీలపై టాటిపత్రులు కప్పే ఉపాధి కల్పించాలని కోరుతూ హిమ్మత్‌నగర్ గ్రామస్తులు గురువారం జీపీ ఆవరణలో నిరాహారదీక్షకు చేశారు. కొండపాక గ్రామస్తులే ఉపాధి పొందుతున్నారని వాపోయారు. న్యాయం జరిగే వరకు దీక్ష విరమించమని స్పష్టం చేశారు.

● **మట్టి తరలింపును అడ్డుకున్న గ్రామస్తులు**

గన్నేరువరం: మండలంలోని మాదాపూర్ గ్రామ చెరువు సమీపం నుంచి అనుమతి లేకుండా మట్టి తరలింపును గురువారం గ్రామస్తులు అడ్డుకున్నారు. రోడ్డు నిర్మాణానికి జేసీబీ ద్వారా మట్టి తరలిస్తుండగా గ్రామస్తులు అభ్యంతరం వ్యక్తం చేయగా అక్కడి నుంచి టిప్పర్లు వెళ్లిపోయాయి. సంబంధిత అధికారులు వివరణ కోరగా మట్టి తరలింపునకు అనుమతి ఇవ్వలేదని తెలిపారు.

● **చికిత్స పొందుతూ వ్యక్తి మృతి**

హుజూరాబాద్: తహసీల్దార్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న బూర సుదర్శన్(52) ఇటీవల కోతుల దాడిలో గాయపడి వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడని కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి భార్య, నలుగురు పిల్లలు ఉన్నారని, ప్రజలను భయపెట్టేలా సంచరిస్తున్న కోతుల నిర్మూలనకు వెంటనే చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

● **వర్షానికి కూలిన మాజీ సర్పంచ్ ఇల్లు**

చిగురుమామిడి: మండలంలోని ముదిమాణిక్యం మాజీ సర్పంచ్ కట్ల కొంరయ్య ఇల్లు ఇటీవల కురిసిన వర్షాలకు కూలిపోయింది. కొంరయ్య ఐదేళ్ల సర్పంచ్‌గా గ్రామానికి సేవలందించినప్పటికీ ఎలాంటి ఆస్తిపాస్తులు సంపాదించుకోలేదు.

వర్షం కురిసిన ప్రతిసారి ఇబ్బందులే



వీణవంక: మండలంలోని వల్బాపూర్ గ్రామ ప్రధాన రోడ్డు చిరుజల్లులకే బురదమయంగా మారుతుంది. దీంతో వర్షం కురిసిన ప్రతిసారి ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు వాపోతున్నారు. బస్టాండ్ నుంచి హనుమాన్ ఆలయం మీదుగా ఊరి కట్ట వరకు సీసీరోడ్డు ఉన్నా శిథిలావస్థలోకి చేరింది. సీసీరోడ్డు ఎత్తు తక్కువగా ఉండటంతో వర్షం నీరు నిలుస్తుంది. బస్టాండ్ సమీపంలోని హనుమాన్ ఆలయం ఎదుట రోడ్డు అధ్వానంగా తయారైంది. డ్రైయినేజీల్లో చెత్తాచెదారం పేరుకుపోవడంతో దోమలు విజృంభించే అవకాశం ఉందని, సంబధిత అధికారులు ఇప్పటికైనా స్పందించి సీసీ రోడ్డు నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.